క్లుప్తంగా

సీడీపీఓ నుండి అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా..


కల్పన

కూసుమంచి: గ్రూప్–2 ఫలితా ఫలితాల్లో మండలంలోని తురకగూడెం గ్రామానికి చెందిన కొమ్ము కల్పన సహకార శాఖలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ఎంపికైంది. కల్పన ప్రస్తుతం ములుగు జిల్లా, ఏటూరు నాగారంలో సీడీపీఓగా విధులు నిర్వహిస్తుంది. కల్పన 2014లో తొలి ప్రయత్నంలోనే వీఆర్వోగా ఉద్యోగం సాధించింది. తాజాగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ కొలువు సాధించింది. ఆమె భర్త కొమ్ము బాబు రావు ఖమ్మంలో పంచాయతీరాజ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తుండగా ఆయన ప్రోత్సాహంతోనే తాను ఈ విజయాన్ని సాధించినట్లు కల్పన తెలిపింది.

కేకేసీ జిల్లా అధ్యక్షుడిగా విప్లవకుమార్



ఖమ్మం మామిళ్లగూడెం: కాంగ్రెస్ పార్టీ అనుబంధ అఖిల భారత అసంఘటిత కార్మికుల ఉద్యోగుల జిల్లా అధ్యక్షుడిగా సీహెచ్.విప్లవకుమార్ పటేల్ నియమితులయ్యారు. ఆయనకు సంఘం రాష్ట్ర చైర్మన్ కౌశల్ సమీర్ సోమవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విప్లవకుమార్ మాట్లాడుతూ జిల్లాలో అసంఘటిత కార్మికుల సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఎంపీని కలిసిన అడిషనల్ డీసీపీ

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం అడిషనల్ డీసీపీ (అడ్మిన్)గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బి.రామానుజం సోమవారం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డిని కలిశారు. గట్టయ్య సెంటర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

పరామర్శ..


పరామర్శిస్తున్న రాయల, దుర్గాప్రసాద్

నేలకొండపల్లి: మండలంలోని కోరట్లగూడెంకు చెందిన బచ్చలకూరి మనోజ్, ప్రసాద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబాలను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు సోమవారం పరామర్శించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని, కాంగ్రెస్ సేవాదళ్ పాలేరు నియోజకవర్గ కన్వీనర్ బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల సత్యనారాయణ, కడియాల నరేష్ ఉన్నారు.

సన్మానం..



ఖమ్మంవైద్యవిభాగం: అంతర్జాతీయ గుండె దినోత్సవ సందర్భంగా సోమవారం స్తంభాద్రి హాస్పిటల్‌లోని ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ పేర్ల హర్ష తేజకు విశ్రాంత పోలీసు అధికారుల సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్.రాధాకృష్ణమూర్తి, రుద్ర వెంకటనారాయణ సన్మానించారు. సంఘం సభ్యులకు ఉచితంగా గుండెకు సంబంధించిన వైద్య సేవలు అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. హాస్పిటల్ పీఆర్‌ఓ ఇషాక్ పాషా, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నివాళి

ఖమ్మం మామిళ్లగూడెం: సీపీఐ నాయకురాలు పరుచూరి రాధమ్మ సోమవారం మృతి చెందగా ఖమ్మంలోని ఆమె స్వగృహంలో రాధమ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, పరుచూరి లక్ష్మి నారాయణ సోదరులు పరుచూరి సూర్యనారాయణ, కుమారుడు పరుచూరి రాధాకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్‌కె. జానిమియా, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సొసైటీ ఉపాధ్యక్షులు రావెళ్ల శ్రీనివాసరావు, రావెళ్ల సురేష్, వాసు ఉన్నారు.

వివాహిత అదృశ్యం

ఖమ్మం అర్బన్: వివాహిత అదృశ్యంపై ఖమ్మం అర్బన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సీఐ భానుప్రకాష్ తెలిపారు. శ్రీనగర్ కాలనీలో భార్యాభర్తలు నివసిస్తుండగా ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న భర్త సోమవారం విధులకు వెళ్లగా, అనంతరం భార్య ఇంటి నుంచి బయటకు వెళ్లి కనిపించలేదు. ఈ మేరకు భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.



సద్దుల సంబురం..

బతుకమ్మకు ఘన వీడ్కోలు
- ఆటపాటలతో మహిళల సందడి

బతుకమ్మ వీడ్కోలు సంబురాలు మిన్నంటాయి. బతుకమ్మ సంబురాల్లో చివరి రోజు సద్దుల బతుకమ్మ వేడుకలను మహిళలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు వివిధ రకాల పూలను సేకరించి బతుకమ్మలను పేర్చారు. గౌరమ్మకు పూజలు చేసి బతుకమ్మలతో కూడళ్లకు చేరి వాటి చూట్టూ డీజే పాటలు, కోలాటాలు, నృత్యాలతో సందడి చేశారు. చివరి రోజు తొమ్మిది రకాల నైవేద్యాలు సమర్పించారు. అనంతరం పోయిరావమ్మా, మళ్లీ రావమ్మా అంటూ చెరువులు, వాగులు జలాశయాల్లో నిమజ్జనం చేశారు. –సాక్షి నెట్‌వర్క్






కోలాటాలతో యువతుల నృత్యం


బతుకమ్మలకు పూజ చేస్తున్న మహిళలు


బతుకమ్మలు పేరుస్తున్న మహిళలు


బతుకమ్మలతో వస్తున్న మహిళలు


నిమజ్జనం చేస్తున్న యువతి


ఖమ్మం అర్బన్: పర్ణశాల రామాలయం వద్ద..


బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో నిమజ్జనం చేస్తున్న ఎంపీ రవిచంద్ర, ఎమ్మెల్సీ మధు, మాజీ మంత్రి సత్యవతి


బతుకమ్మలతో మహిళ,చిన్నారులు


కామేపల్లిలో..


తిరుమలాయపాలెంలో..


నేలకొండపల్లిలో..

దుకాణాలకు మార్కింగ్, నంబర్ల కేటాయింపు

- ఎస్టేట్ ఆఫీసర్, వ్యాపారులకు మధ్య వాగ్వాదం


దుకాణాలకు మార్కింగ్ చేయిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణంలో దుకాణాల కేటాయింపును అధికారులు వేగవంతం చేశారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాలతో ఇప్పటికే ప్రాంగణంలో వ్యాపారాలు చేసే వారిని గుర్తించిన మెప్మా అధికారులు సోమవారం కొలతల ప్రకారం దుకాణాలు కేటాయించేలా మార్కింగ్, నంబర్లు వేశారు. మెప్మా టీఎంసీ సుజాత పర్యవేక్షణలో నంబర్లు కేటాయించగా, రెండు రోజుల్లో ప్రక్రియను పూర్తి చేసి, వీధి వ్యాపారులకు దుకాణాలు కేటాయించనున్నారు. కాగా, వీధి వ్యాపారుల ప్రాంగణంలో ఎస్టేట్ ఆఫీసర్‌కు, వ్యాపారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. మార్కింగ్ కోసం సిబ్బంది వస్తుండడంతో కూరగాయలు, సరుకులను పక్కన పెట్టాలని ఎస్టేట్ ఆఫీసర్ సూచించినట్లు సమాచారం. ఈ సమయాన ఓ వ్యాపారి బంధువులు, అధికారికి మధ్య మొదలైన మాటల యుద్ధం తీవ్ర స్థాయికి చేరినట్లు తెలిసింది. దీంతో పరస్పరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా అధికారికి, వ్యాపారులకు మధ్య స్వల్ప వివాదం చోటు చేసుకుందని, కేఎంసీ అధికారుల నిర్ణయం మేరకు దుకాణాలకు నంబర్లను ఇస్తున్నట్లు తెలిపారు.

‘పండుగపూట పస్తులు’

ఖమ్మంమయూరిసెంటర్: పండుగపూట పంచాయతీ కార్మిక కుటుంబాలను పస్తులుంచొద్దని, వెంటనే పెండింగ్ వేతనాలను చెల్లించాలని టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామయ్య, తెలంగాణ ప్రగతిశీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పగిడికత్తుల రామదాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించి, అనంతరం అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డికి వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా అధ్యక్షులు అమర్లపూడి అప్పారావు, నాయుకులు మిగడ సైదులు, కత్తుల భిక్షం, చిట్టెం సైదులు, జోగా నాగేశ్వరావు, సందీప్, కనకరాజు, ప్రసాద్, భీమా, రమేష్, రాజు, రవి, శంకర్, హరిదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ స్థానంలో బీఆర్‌ఎస్ పోటీ

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అన్ని స్థానాలలో పోటీ చేస్తుందని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వున్నం బ్రహ్మయ్య అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసినందున ఎన్నికలకు ప్రతీ కార్యకర్త సిద్ధంగా ఉండాలని సూచించారు. ఎన్నికల్లో సత్తా చాటేందుకు సైనికుల్లా పని చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కోటి సైదారెడ్డి, శాఖమూరి సతీష్, వి.శ్రీనివాసరావు, కాసాని నాగేశ్వరరావు, మరికంటి రేణుబాబు, కమదన ప్రవీణ్, యాతాకుల భాస్కర్, సాడే పొంగు ప్రశాంత్, వాజీద్, షేక్ హుస్సేన్, గడ్డం లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి అలంకరణలు, పూజలు


సరస్వతి దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పలు ఆలయాల్లో, మండపాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారు సరస్వతి అలంకరణలో దర్శనమివ్వగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. పలుచోట్ల సామూహిక, కుంకుమ పూజలు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు చేపట్టారు. – సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంగాంధీచౌక్: శ్రీ వాసవి ఆలయంలో సరస్వతి పూజలు చేస్తున్న విద్యార్థులు


కూసుమంచి: గట్టుసింగారంలో..


ఖమ్మంఅర్బన్: 12వ డివిజన్‌లో..


కామేపల్లిలో..

కేఎంసీ సమాచారం..

గ్రీవెన్స్‌లో ఫిర్యాదులు స్వీకరించిన కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: కేఎంసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో సోమావారం కమిషనర్ అభిషేక్ అగస్త్య ఫిర్యాదులు స్వీకరించారు. నార్త్, సౌత్ జోనల్ కార్యాలయాల పరిధిలో వచ్చిన ఫిర్యాదులతో కలిపి మొత్తం 29 ఫిర్యాదులు అందాయని, వాటిని వెంటనే పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఇక కేఎంసీలో ఏర్పాటు చేసిన ఫిర్యాదుల బాక్స్‌ను సీసీ వీరబాబుతో తెరిపించిన కమిషనర్ వాటిలో ఐదు ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు.

గ్రూప్–1 ఉద్యోగులకు సన్మానం

ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్–1 ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన కేఎంసీ ఉద్యోగులను కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం సత్కరించారు. కేఎంసీలో జూనియర్ అకౌంటెంట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తూ డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పోస్టింగ్ పొందిన ఎం.మురళి, వార్డు ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తూ జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారిణిగా ఎంపీఐ మెదక్ జిల్లా డీఎస్‌డీవోగా పోస్టింగ్ పొందిన నెల్లూరి సింధు కమిషనర్‌ను కలిసి మిఠాయిలు అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వారిని సన్మానించారు. ఈ మేరకు వారిని అకౌంట్స్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి, కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, వార్డు ఆఫీసర్లు అభినందించారు. అనంతరం వారు కేఎంసీ విధుల నుండి రిలీవ్ అయ్యారు.


మురళి, సింధులతో కమిషనర్ అభిషేక్ అగస్త్య

బతుకమ్మ ఘాట్ పరిశీలన..

బతుకమ్మ నిమజ్జన ఘాట్‌ను కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. సాయంత్రం వేళ సద్దుల బతుకమ్మ వేడుకలను జరుపుకునేందుకు పెద్ద సంఖ్యలో మహిళలు హాజరవుతారని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ వెల్లడించారు. నేలపై మొత్తం మ్యాట్‌లను పరిచి, లైటింగ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇక మహిళల కోసం ప్రత్యేకంగా మొబైల్ టాయిలెట్ల వాహనాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

సౌకర్యాలు, భద్రత పటిష్టంగా ఉండాలి


నిమజ్జన ఘాట్‌ను పరిశీలిస్తున్న మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని కాల్వొడ్డు వద్ద బతుకమ్మ నిమజ్జన ఘాట్‌ను మేయర్ పునుకొల్లు నీరజ సోమవారం పరిశీలించారు. సద్దుల బతుకమ్మ వేడుకల్లో మహిళలు మున్నేరు వద్ద బతుకమ్మలు ఆడి, నిమజ్జనం చేసేలా చేసిన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఘాట్ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, మహిళలు బతుకమ్మ ఆడి, నిమజ్జనం చేసేందుకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. భద్రత ఏర్పాట్లు పటిష్టంగా ఉండాలని, ఘాట్ ప్రాంతం అంతా వెలుతూరు ఉండేలా లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. మేయర్ వెంట ఈఈ కృష్ణాలాల్, డీఈ శ్రీనివాసులు, నాయకులు కన్నం ప్రసన్నకృష్ణ, గజ్జల వెంకన్న తదితరులు ఉన్నారు.

మార్కెట్ పనులు సకాలంలో పూర్తి చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంవ్యవసాయం: మోడల్ మిర్చి మార్కెట్ పనులు సకాలంలో పూర్తి చేయాలని సీపీఎం అనుబంధ రైతు సంఘాలు, వ్యాపార వర్గాలు, కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారం ఆయా వర్గాల ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రదర్శనగా వెళ్లి మార్కెట్ కమిటీకి వినతిపత్రం అందించారు. 18 నెలల్లో పనులు పూర్తి చేస్తామని ప్రకటించినప్పటికీ ఇప్పటి వరకు ఒక్క షెడ్డు నిర్మాణం కూడా పూర్తి కాలేదని ఆందోళ వ్యక్తం చేశారు. సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రం, శ్రీను, ఎర్ర గోపి, వెంకట్రావు, పత్తిపాక నాగసులోచన, షేక్ ఇమామ్, సైదులు, రంజిత్, బండారు వీరబాబు, బజ్జూరి రమణారెడ్డి, సోమారపు సుధీర్‌కుమార్, మేడబోయిన లింగయ్య, మోహన్‌రావు, బండి నవీన్ ఉన్నారు.

48వ డివిజన్‌లో సమస్యలను పరిష్కరించండి

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 48వ డివిజన్‌లో ఉన్న సమస్యలు పేరకుపోయాయని సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ అన్నారు. ఈ మేరకు సీపీఎం ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన పాదయాత్రలో నాయకులు గుర్తించిన సమస్యలను పరిష్కరించాలని పార్టీ ఆధ్వర్యంలో సోమావరం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బండారు రమేష్, త్రీ టౌన్ కార్యదర్శి భూక్య శ్రీనివాసరావు, నాయకులు తోకల బాబు, మద్దెల పుల్లారావు, పెద్దప్రోలు రామకృష్ణ, శ్రీధర్, హన్మంతురావు, చంద్రశేఖర్, గుమ్మడి భిక్షం పాల్గొన్నారు.

కులరహిత సమాజానికి పోరాడుదాం


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మం మామిళ్లగూడెం: కులరహిత సమాజం కోసం పోరాడుదామని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం రామనరసయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. రాకెట్ యుగంలోకి వెళ్లిన ఇంకా దేశంలో కులం ఆనవాళ్లు కొనసాగడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వాలు సహితం ఓట్ల కోసం కుల రాజకీయాలకు పూనుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. మహాత్మ జ్యోతిబాపూలే అంబేద్కర్ నారాయణ ,గురు పెరియార్ తదితరులు ఆచరించి చూపిన మార్గంలో కుల నిర్మూలన కోసం వర్గ పోరాటాలలో మిళితం చేసి పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. నాయకులు పుల్లయ్య, ఆవుల అశోక్, బందెల వెంకయ్య, సిహెచ్.శిరోమణి, ఆర్.శివలింగం, ఝాన్సీ, శోభా నాగేశ్వరరావు, లక్ష్మణ్, దేవల వెంకటేష్, రాకేష్, తిమ్మిడి హనుమంతరావు, యాదగిరి, భద్రయ్య తదితరులు ఉన్నారు.

తెప్పలపై తెచ్చి.. ట్రాక్టర్లలో నింపి

ఆగని ఇసుక అక్రమ రవాణా
- అభివృద్ధి పేరుతో అక్రమార్కుల బరితెగింపు
- అరికట్టే అధికారులు కరువు


రామచంద్రాపురం ఏటిలోనే డంప్ చేసిన ఇసుక

నేలకొండపల్లి: ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటం లేదు. అభివృద్ధి పనుల పేరుతో అక్రమార్కులు ఇసుకను తోడేస్తున్నారు. నియంత్రించాల్సిన అధికారులు కనిపించటం లేదు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ప్రైవేట్, ప్రభుత్వ అభివృద్ధి పనులు జోరుగా సాగుతుండటంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. ఇదే అదునుగా భావించి జోరుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మైనర్లు సైతం భాగస్వాములు..

ఇసుక అక్రమానికి కేరాఫ్‌గా నేలకొండపల్లి మండలం పేరొందింది. మండలంలోని రామచంద్రాపురం, సుర్దేపల్లి, పైనంపల్లి, బుద్ధారం తదితర గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. ఏటి పరివాహక ప్రాంతంలో ఇసుకను తోడేస్తున్నారు. ఏకంగా యంత్రాల ద్వారా ఇసుకను డంపు చేసి అనుమతులు లేకుండా రవాణా చేస్తున్నారు. అరికట్టాల్సిన అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో చివరకు మైనర్లు కూడా ఇసుక అక్రమంలో భాగస్వామ్యులవుతున్నారు. తాజాగా బుద్ధారం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తు ప్రమాదవశాత్తు ఇటీవల ట్రాక్టర్ బోల్తాపడి మైనర్ బాలుడు మృతి చెందాడు. మండలంలో జరిగే ఇసుక అక్రమ దందాపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పలువురు సామాజిక కార్యకర్తలు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వీడాలని కోరుతున్నారు.

తిలాపాపం.. తలా పిడికెడు చందంగా..


రామచంద్రాపురం ఏటిలోనే డంప్ చేసిన ఇసుక

వర్షాలు సమృద్ధిగా కురుస్తుండటంతో వాగుల్లో ఇసుక భారీగా మేటలు వేస్తోంది. దీంతో పరివాహక ప్రాంతాల్లో అక్రమార్కులు యంత్రాల ద్వారా ఇసుకను తోడేస్తూ పగలు, రాత్రి తేడాలేకుండా యథేచ్ఛగా తరలిస్తున్నారు. ఏరు ఉధృతంగా ప్రవహిస్తున్నా తెప్పల ద్వారా ఇసుకను ఒడ్డుకు తీసుకొస్తున్నారు. నీటిలో మునిగి ఇసుకను బయటకు తీసి తెప్పల ద్వారా తీసుకొచ్చి ట్రాక్టర్‌లను నింపుతున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. మండలం నుంచి జిల్లా కేంద్రంకు ప్రతీ రోజు ఇసుక ట్రాక్టర్లు తరలిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవటం లేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ట్రాక్టర్ టక్కుకు రూ.8 వేల వరకు వసూలు చేస్తున్నారని అక్రమార్కులు బరితెగించి ఇసుకను తరలిస్తున్నారంటే తిలా పాపం తలాపిడికెడు అన్న చందంగా వ్యవహారం తయారైందని, అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఎంతటి వారైనా సహించం



ఇసుక తరలించే వారు ఎంతటి వారైనా సరే సహించేది లేదు. మండలంలో ఎక్కడా కూడ అనుమతులు ఇవ్వలేదు. ఎక్కడి నుంచైనా అక్రమంగా తరలిస్తే వాహనాలను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగిస్తాం. అక్రమంగా తరలించి పట్టుబడే ట్రాక్టర్లకు జరిమానా విధిస్తున్నాం.
– వి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్, నేలకొండపల్లి